క్లుప్తంగా

కంపోస్ట్ ఎరువు తయారీ



ఎరువు తయారీని పరిశీలిస్తున్న ఎంపీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని డంప్‌యార్డులో తడి చెత్తతో తయారు చేసే కంపోస్ట్ ఎరువు బాగుందని ఎంపీఓ రమేశ్ అన్నారు. గురువారం ఆయన గ్రామంలోని డంప్‌యార్డులో తయారు చేసే కంపోస్ట్ ఎరువు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్కుల్‌లో కంపోస్ట్ ఎరువు తయారీ చేయడంతో పాటు, ఆ ఎరువును ప్యాకింగ్ చేసి గ్రామస్తులకు తక్కువ ధరకు అమ్మడం హర్షణీయమన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ.. తయారైన ఎరువును కిలో, రెండు కిలోల ప్యాకింగ్‌లు తయారు చేసి కిలో రూ. 10 కి అమ్ముతున్నామని, మిగతా ఎరువును పల్లె ప్రకృతివనం, నర్సరీలో మొక్కలకు వినియోగిస్తామన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు శ్రీధర్‌రెడ్డి, శోభ బాలికలకు బ్లడ్‌గ్రూపింగ్‌తో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. పిల్లలు రక్త హీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడి గుడ్లు ఆహారంలో ఎక్కువగా తినాలని చెప్పారు. వ్యక్తగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సాజిద్‌అలీ, ల్యాబ్ టెక్నీషియన్ సల్మాన్, ఆశవర్కర్ నవనీత విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డికి అభినందనలు



ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని నార్సింగి జెడ్పీటీసీ కృష్ణారెడ్డి కలిశారు. గురువారం హైదారాబాద్‌లోని కొత్త ప్రభాకర్‌రెడ్డి నివాసంలో నార్సింగి పీఏసీఎస్ డైరెక్టర్ బిక్యానాయక్, నర్సంపల్లి పెద్దతండా సర్పంచ్ చత్రియానాయక్ తదితర నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాషానాయక్ ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి సన్నిధాన క్షేత్రంలో గురువారం మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన గురుస్వామి రమేశ్‌గౌడ్, హరీశ్‌గౌడ్, రంజిత్‌గౌడ్, సాయిగౌడ్, శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో అయ్యప్పకు అభిషేకం చేసి, పడి జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భజనలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో గురుస్వాములు రంగారావు, నరేందర్, సిద్దాగౌడ్, బాలకిషన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు

తూప్రాన్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి తూప్రాన్ మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంతో పాటు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. హైదరాబాద్‌కు తరలిన వారిలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ పట్టణాధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నర్సాపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం గురువారం సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రషీద్, రసన్ రాధాకిషన్‌గౌడ్, శ్రీపతి, ఇషాక్‌అలీ, అన్వర్ తదితరులు గురువారం పట్టణంలోని చౌరస్తాతో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద టపాకాయలు కాల్చి హర్షం వ్యక్తం చేశారు.



నర్సాపూర్‌లో టపాకాయలు కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్న వారిలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణాగౌడ్, మల్లేశం, కృష్ణ, మైసయ్య, శ్రీకాంత్‌రెడ్డి, శంకర్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): మండలంలో విజయోత్సవాలు నిర్వహించిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపీటీసీ శ్రీనివాస్, నిరలక్ష్మప్ప, కిషన్‌రెడ్డి, ఖలీం, కార్యకర్తలు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ర్యాలీలు, సంబరాలు నిర్వహించిన వారిలో మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్‌రెడ్డి, కృష్ణ, వెంకట్ గౌడ్, చందు, గౌస్, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండలంలో సంబురాలు నిర్వహించిన వారిలో పంజా మహేందర్, వెంకటపూర్ కె. మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వినోద్, కాకి రాజయ్య, రవీందర్‌రెడ్డి, మహేశ్, బాలయ్య, మధుసుదన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



శివ్వంపేటలో ..



నిజాంపేటలో..



పాపన్నపేటలో..

బాలకిషన్ లేనిలోటు తీరనిది

చిన్నశంకరంపేట(మెదక్): గిరిజన నాయకుడు ఖాజాపూర్ బాలకిషన్ ఆకాల మరణం తీరనిలోటని బీజేపీ గిరిజన మోర్చా మాజీ జాతీయ కార్యదర్శి అమర్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని ఖాజాపూర్ తండాలో ఏర్పాటు చేసిన విగ్రహ ఆవిష్కరణలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాపారంలో రాణించిన బాల్‌కిషన్ తాను ఎంత సంపాదించిన తన ప్రాంతంపై ప్రేమతో ఖాజాపూర్ గ్రామ సర్పంచ్‌గా సేవలు అందించారన్నారు. గిరిజన సమాజానికి సేవలు అందిస్తూ.. మన్నన పొందిన బాలకిషన్ మృతి తీరనిలోటన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రియానాయక్, మాజీ ఎంపీటీసీ లాల్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పట్లోరి రాజు, బండారు స్వామి, నాయకులు భిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ రామకిష్టయ్య బాలకిషన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



బాలకిషన్ విగ్రహావిష్కరణలో అమర్‌సింగ్, ప్రియానాయక్

రైతులు వరికొయ్యలు కాల్చొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): వరిపంట కోసిన తర్వాత కొయ్యలను కాల్చొద్దని కేవీకే శిక్షణ విద్యార్థులు రైతులకు సూచించారు. గురువారం మండలంలోని తునికి వద్ద ఉన్న డీ. రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు మండలంలోని వెల్మకన్న గ్రామంలో రైతులకు యాసంగి పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారం తగ్గుతుందన్నారు. నేలపైన ఉన్న జీవరాశులు, మిత్ర పురుగులు చనిపోతాయని దీంతో రైతులకు నష్టం కలుగుతుందన్నారు. దీంతో పాటు వాయుకాలుష్యం పెరుగుతుందని, భూమిలో కలియ దున్నడంవల్ల భూసారం పెరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా రసాయన ఎరువులు వాడాలని, మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడొవద్దన్నారు. విత్తన శుద్ధి చేయాలని, రైతులు సేంద్రియ సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శిక్షణ విద్యార్థులు పూజిత, హారిక, రుచిత, సౌమ్య, మేఘన, ప్రణతి గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే విజయం



ఎమ్మెల్యే సునీతారెడ్డిని సన్మానిస్తున్న యువకులు

నర్సాపూర్: అందరి సహకారంతో తాను ఎన్నికల్లో విజయం సాధించానని, తనకు సహకరించిన వారికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డిని ధన్యవాదాలు తెలిపారు. గురువారం హత్నూర మండలంలోని కాసాలకు చెందిన పలువురు యువకులు, ఆయా గ్రామాల నాయకులు సునీతారెడ్డిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సబ్‌స్టేషన్‌ల పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్‌బాబు తెలిపారు. చేగుంట మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు నిర్వహిస్తున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు ఇండస్ట్రీస్ ఏరియా, సూరారం, ధరిపల్లి, గవ్వలపల్లి, మడూర్, శాలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధి గ్రామాలకు విద్యుత్ ఉండదని అన్నారు. వినియోగదారులు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

మంత్రి దామోదరకు శుభాకాంక్షలు



మంత్రి దామోదరకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రేగోడ్(మెదక్): మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, పార్టీ మండలాధ్యక్షుడు దిగంబర్‌రావు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యా నాయక్ తదితరులు తరలివెళ్లారు. అనంతరం వైద్యా, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆరోగ్య పరిస్థితులపై గ్రామాల్లో సర్వే

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్, ముట్రాజ్‌పల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసర్చ్) ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించారు. ఐసీఎంఆర్ మెడికల్ ఆఫీసర్ జయప్రకాష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఈ సందర్భంగా వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, కుటుంబ ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేశారు. ఇంటింటికీ తిరిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, ఐసీఎంఆర్ అధికారులు నవీన్, శ్రీనివాస్, లావణ్య, గోపి అంగన్‌వాడీ టీచర్లు, నాగరాణి, పద్మ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.



ముట్రాజ్‌పల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

పాడైపోయిన వాల్.. ట్యాంకులోకి చేరని నీరు

శివ్వంపేట(నర్సాపూర్): రక్షితవాటర్ ట్యాంకుకు సంబంధించి వాల్ పాడైపోయింది. దీంతో ట్యాంకులోని నీరు చేరడం లేదు. మండల కేంద్రమైన శివ్వంపేటలోని హనుమాన్ నగర్‌కు మంజీర తాగు నీటిని అందించే రక్షిత వాటర్ ట్యాంకు వాల్ నుంచి నీరు లీకై నీరు ట్యాంకులోకి చేరకపోవడంతో రెండు రోజుల నుంచి పలు కాలనీలకు తాగునీరు అందడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవ్య వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో గ్రామ దేవతల ఉత్సవాలు గురువారం ప్రారంభమైనవి. సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు ఆధ్వర్యంలో దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 11 వరకు గ్రామంలో జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, ఉప సర్పంచ్ పాండురంగం, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్, సునందరెడ్డి, రాజు, యాదిరెడ్డి, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతెలో అభయాంజనేయ స్వామి ఆలయ 10వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ప్రజల దీవెనతో ఎమ్మెల్యేగా గెలుపొందానని.. పట్టణాలకు ధీటుగా పల్లెలను అభివృద్ధి చేస్తానన్నారు. దుబ్బాక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దడానికి పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. భక్తిభావన కలిగిన పల్లెలు ప్రశాంతతకు నిలయాలుగా మారుతాయన్నారు.

వాన.. రైతన్న హైరానా!



మర్పడ్గ శివారులో ధాన్యం కుప్పలపై నిలిచిన వర్షం నీరు



సిర్సనగండ్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన దృశ్యం

● పంట చేతికందే సమయంలో నష్టం

కొండపాక(గజ్వేల్): మిచాంగ్ తుఫాన్ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే సమయంలో నష్టాన్ని తెచ్చిపెడుతోంది. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. పక్కనే మల్లన్నసాగర్ ప్రాజెక్టు, చెరువుల్లో నీటి నిల్వలు ఎక్కువగా ఉండడంతో రైతులు వరి వైపు మొగ్గు చూపారు. గతేడాది కంటే కాస్త ఆలస్యంగా పంట చేతికందుతుండడంతో కూలీలు, హార్వెస్టర్ల కొరతతో పనులు మెల్లగా సాగుతున్నాయి. కోసిన పంటను రైతులు రోడ్లపైనే కుప్పలు పోసుకున్నారు. కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో వారం రోజులుగా రోడ్లపైనే ధాన్యం కుప్పలు పేరుకుపోయాయి. రెండు, మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం తడిసిముద్దయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతూ తడిసిన ధాన్యాన్ని వేరు చేస్తూ ఆరబెడుతున్నారు. ఇదిలా ఉండగా కోత దశకు చేరుకున్న పంట చేనులోనే ఉండడంతో వర్షానికి నేలవాలి దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దగా కొనుగోళ్లపై దృష్టి పెట్టలేకపోయారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

పాలకవర్గం రాజీనామా

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడి మార్కెట్ కమిటీ పాలకవర్గం రాజీనామా చేసింది. ఈమేరకు గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డితో పాటు డైరెక్టర్లు తమ రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ సిబ్బందికి అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ జహంగీర్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. మార్కెట్ యార్డు విస్తరణకు ఇప్పటికే 70 ఎకరాల భూమి సేకరించామని తెలిపారు. గిడ్డంగులు, తదితర నిర్మాణాల కోసం రూ. 100 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ అభివృద్ధికి పాటుపడి రైతులకు సమస్యలు రాకుండా చూడాలని కోరారు.



సిబ్బందికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న జహంగీర్